కూతుళ్ల తల్లి

"చిన్నమ్మమ్మ వస్తోం దమ్మా"

"ఏమి పని తొందరలో వుంటావో అనుకుంటూ—"

"పను లెప్పుడూ వుండేవే, రావమ్మా పిన్నీ, సరిగా పిలిచినట్టు వచ్చావు"

"అదేమిటి, వుత్తరమా రుక్కు చేతిలోది?"

"మరే నమ్మా"

"ఎవరు రాశారూ?"

"రాజం చెల్లాయి రాసిం దమ్మమ్మా"

"ఏలూరిలోనే వుంటున్నాడా దాని మొగుడు?"

"ఆ, ఆ, మీదటికి మద్రాసు ప్రవేశిస్తాడు"

"ఇప్పు డెందుకు రాసిందీ రాజు?"

"ఇప్పు డేమిటి, నెల పట్టాక యిది నాలుగో వుత్తరం. రకరకాలుగా— కవిత్వం కడతారుట యెవళ్లోను? అలాగ, అదే రాస్తుందో, అతనే రాయిస్తాడో మరి, యేమిమాటలే పిన్నీ అవి? నా కూతుర్ని నేను మెచ్చుకోడం కాదుగాని, మొగాళ్ళయినా రాయలే రలాగ"

"ఏమి రాసిం దేమిటి, అంతగా మురిసిపోతున్నావు?"

"ఇప్పటికి మూడు మాట్లు చదివింది రుక్కు, నా కింకా సరదా తీరలేదు. మరి, వూహించుకో ఆసొగసు"

"అమ్మ మ్మోయ్! మా చిన్నక్కా మాచిన్నబావా బజారుకి వెళ్ళారుట. అక్కడేం?....మరేం?....మాఅక్కా? ...ఎంతో చక్కని....అదేమిటే పెద్దక్కా?"

"నువ్విలా రా చెల్లీ! చిన్నపిల్లలు వింటూ కూచోవాలి, మాట కడ్డు రాకూడదు"

"మరి నాకు కొత్తగౌను కుట్టించమంటావా, పండుగకి అమ్మని?"

"నేను కుట్టిస్తానిలా రా జానకీ, నువ్వు"

"వోయ్! వోయ్! చిన్నమ్మమ్మ నాకు కొత్తగౌను కుట్టి–స్తుం–దిట. ఇక మాట్టాడను. ఏం, అమ్మమ్మా?"

"....రాజులా కూచో నా వొళ్లో"

"....నువ్విక చదవ్వే పెద్దక్కా!"

"సంకురాత్రికి దాని మొగుణ్ణి పిలవ మేమో అని—యిక దాని అదుర్దా యేమని చెప్పను? అయినా, యేమి చేస్తుందో చూద్దా మని బదులు రాయనిచ్చాను కాను. మీఅల్లుడుఃగారిని ఇది చివరి వుత్తరం అన్నట్టు రాసింది, కోపం వచ్చింది కామోసు"

"నన్ను కూడా వూరించేస్తున్నావు నువ్వు"

"దాని మాట లెరుగుదువుకదా, చిన్నప్పణ్ణుంచీని?"

"అయ్యో, యెరగనూ? నెల్లూరి నెరజాణ అవుతుం దనలేదూ నే నెన్నో మాట్లు?"

"ఆపైని మొగుడు ప్లీడరు కూడాను"

"అవునవును, అదీని"

"ఏదీ, పిన్ని వింటుంది మళ్ళీ మొదణ్ణుంచీ చదువు రుక్కూ"

"నువ్వు మాట్టాడకు. ఏం జానకీ?"

"ఇవాళే కుట్టించాలి మరి గౌను. ఏం?"

"దీపాలు పెట్టాటప్పటి క్కుట్టించేస్తాను, సరా?"

"!!!!!!!!!!!! !!!!!!!!!!"

"వినవమ్మా, అమ్మమ్మా! మహాలక్ష్మిస్వరూపురాలు మా అమ్మకి దండాలు. నాన్నగారికి నానమస్కారాలు చెప్పవలసింది. అక్కయ్యకిన్నీ, బావ వచ్చివుంటే అతనికిన్నీ గూడా నా నమస్కారాలు చెప్పవలసింది, చెల్లాయికీ, తమ్ముడికీ నాముద్దులు—"

"నామాట కూడా రాసింది చిన్నక్క కదూ అమ్మమ్మా?"

"మరే నమ్మా, రాసింది"

"ఇక్కడికి లాంఛనాలు ముగిశాయి, ఇక గొడవలు మొదలు. చదవ్వే రుక్కూ"

"నాలుగుత్తరాలు రాశా న్నేను, వొక్కదానికీ బదు ల్లేదు. వింతగా వుంది. ఉడికిన్నీపోతున్నా న్నేను మీకు కోపం తెప్పించివుంటాను. లేకపోతే, యిది యిలా జరిగివుండదు అయితే, చాలాచాలా ఆలోచించా న్నేను, నాతప్పున్నూ యేమీ కనపడదు, మళ్ళీ"

"విన్నావా? దీనిపే రేమిటమ్మా? ఎలాగమ్మా దీంతో వేగడం?"

"తప్పుతుందా?"

"... ఇక్కడ నాకో చెలికత్తె దొరికింది. మాబాటు హౌసులో అద్దెకున్న వారి రెండోకోడలు, ఆపిల్ల. మనసు లిట్టే కలిసిపోయాయి మాకు. నిన్ననే పుట్టింటికి వెళ్ళింది. సంకురాత్రి వస్తోంది కాదూ? అందుకోసం వెళ్ళింది"

"ఆవివరా లన్నీ యెందుకో రాయడం?"

"తాను వెళ్ళి నెలా పదిహేను దినాలు కాలేదింకా. ఆపిల్ల వచ్చి యెన్నాళ్ళయిందో మరి? అది ముందు వెళ్ళడమే రాసింది గాని యీ సంగతి రాసిందా మరి?"

"ఆపిల్ల అత్తవారి యింటో యెన్నా ళ్లుందో అన్నాళ్లూ అయితే గాని, చెల్లాయిని తీసుకురావా యేమిటమ్మా?"

"ఇలా సందేహించే రాయడం మానేసిం దంటావా చెల్లి?"

"ఏమో?"

"మరి, నన్నలా అడిగావేం?"

"చెల్లాయిని విడిచి చాలా రోజు లయింది కనకా, నువ్వెదురుగా వున్నావు కనకాను"

"ఔనమ్మా, రుక్కు సరిగా చెప్పింది ఇక వుత్తరం చదవ్వే"

"నిన్ను తీసుకువెళ్ళడానికి వచ్చారు కారు, మీవా ళ్ళింకా. వచ్చివుంటే, నేను మావాళ్ళ యింటికి వెళ్ళడం మానేసి, మీవాళ్ళ యింటికి వస్తును" అంటూనే నన్ను విడిచి వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళిం దది, పాపం!"

"అవెక్కడి స్నేహాలే మామ్మా?"

"ఇంకా వినవమ్మా"

"మేమిద్దరమూ వొక్కచోటే వుంటే యీపండుగెంత బాగుండునో అని పిస్తోంది, నాకున్నూ. తప్పనిసరి కావడంవల్ల వెళ్ళింది గాని— మూడు పండుగులూ వెళ్ళగానే—మొగుడితోనే వచ్చేస్తుందిట మళ్ళీ. నన్నూ అలాగే ముక్కనుమునాడే వచ్చెయ్య మని ఛాలా చెప్పి వెళ్ళింది లేకపోతే, వొప్పుకోదుట"

"అలాగే రమ్మంటే యేమన్న మాటా?"

"కనిపెట్టావుగదా? అదే లాపాయింటు"

"అలాగే రమ్మంటే, పండుగు వెళ్ళగానే తనలాగ మొగుడితోనే వచ్చెయ్యమని, అర్థం ఇందులో రహస్యం యేమి వుందమ్మమ్మా?"

"అంటే, చెల్లాయిని తీసుకు వస్తే చాలదు, దాని మొగుణ్ణి కూడా తీసుకు రావా లన్న మాటేనా?"

"లేకపోతే, దాన్ని వొకర్తినీ తీసుకువస్తావా? చూశావా అమ్మమ్మా?"

"పోనీ, నాలుగుత్తరాలు రాసింది గదా, యెంత సేపూ తన మాటే రాస్తుంది గాని తన మొగుడి మాట రాయదేం, స్పష్టంగా?"

"చిన్నపిల్ల గదా, అలా రాయగలదా సాహసించి?"

''అదేనే, మీ అమ్మ అన్నదాల్లో తప్పేమీ లేదమ్మా! దాని మొగుడు ప్లీడరు కనక, ఆగడుసు రాత చూసి లా పాయింటు అంది మీ అమ్మ. నీ మొగుడు జమీందారు కనక, నువ్వు అలా రాస్తే టెక్కు అంటుంది, అంతే భేదం''

''ఏం, ముసిముసినవ్వులు నవ్వుకుని వూరుకుంటావేం?''

''అది మాత్రం చిన్నపిల్ల కాదుటే, చెల్లెల్ని వెనకవేసుకు వచ్చింది గానీ?....చదువమ్మా, వుత్తరం చదువు''

''....పెద్దపండుగు, ఇక, నాలుగు రోజులే వుంది. అంటే ఆవేళా యీవేళా కాక మధ్యని రెండు రోజులే వున్నాయి''

''అయితే?''

''మాకు రాయడం యెందుకమ్మా ఆమాటా? ఆమాత్రం లెక్క కూడా చేతకాదా నాకు?''

''నాన్నగా రింకా రాలేదే మని అడగడం, అది''

''సరే మరే?''

"మా అమ్మ బదులయినా రాయకపోడంవల్ల చెల్లాయి అక్కడ యెంత యిదయి పోతోందో—"

"మరి నీమాట మీ ఆయన యెప్పుడు వస్తాడూ?"

"మా అమ్మ నడుగు ఆమాట"

"నాకేం తెలుస్తుంది పిన్నీ, ఆజమీందారుగారి సంగతి?"

"ఉత్తరం రాయించావా?"

"అలా అడుగు, నిలవదీసి!"

"అడిగితే నాకేం భయమా? నువ్వు న్యాయం చెప్పవమ్మా పిన్నీ! రాజం యిక్కడ లేదు కనక, దాన్నీ, దాంతో పాటు దాని మొగుణ్ణీ మేము పిలవాలి తా నిక్కడే వుంది కదా, తన మొగుణ్ణి మేమెందుకు పిలవాలీ? రమ్మని తాను రాసుకుంటే— అతగాడు వస్తే— పప్పూ అన్నమూ పెట్టి, మేము, పచ్చంచుల బట్టలు—"

"చూశావా అమ్మమ్మా? నీపుట్టింటికి రమ్మని రాయడానికి నీకేం అధికారం వుందని అడిగితే నేనేం చెప్పగలనమ్మా?"

"పోనీ, మేమే రాస్తాం, నిజమే; కాని తాను రాయడం మానేస్తుందా? తను రాయకుండా అతగాడు వస్తాడా?"

"నే నేం రాస్తా నమ్మా?"

"ఏమో, నాకేం తెలుసూ?"

"అది కాదు, నేను చెబుతాను వినవే అమ్మాయీ! నువ్వు పండుక్కి రమ్మని రాస్తావు, అంతే. రుక్కు ఆమాటే యెత్తుకోదు. ఆఅగత్యమే లేదు దానికి "మిమ్మల్ని చూసి చాలా రోజు లయింది. నాకళ్ళు కాయలు కాసిపో యాయి. వీధి గుమ్మంలో నుంచుని మీకోసం యెదురుతెన్నులు చూడ్డంతోనే సరిపోతోంది, నాపని. నాకు అన్నం సయించడం లేదు—"

"వూరుకో వమ్మా"

"నాకు నిద్ర రావడం లేదు. ఇప్పు డయినా నుంచున్న పాళంగా రాక పోతే—"

"మా పెద్దక్క బెజవాడ వెడుతుందా యేమిటి అమ్మమ్మా? అయితే, నేనూ వెడతాను. ఏమే పెద్దక్కా, తీసుకువెడతావా?"

"సెబాస్, జానకి, చెప్పింది బాగుందే అమ్మాయ్"

"చూశావా? నాకూతుళ్ళ ధోరణి యిలా వుంది. తమ మాటే గాని నాగొడవ అక్కర్లేదు వాళ్ళకి. ఏం చెప్పుకోనమ్మా?"

"తప్పా తల్లీ? వాళ్ళ ఆశ లన్నీ నీమీద వున్నాయి. నువ్వు కాకపోతే, వాళ్ళ ముద్దుముచ్చ ట్లెవరు తీర్చగలరు తల్లీ?"

"ఏం, అమ్మమ్మ వున్నమాట చెప్పింది. ఇప్పు డయినా వుత్తరం రాయిస్తావా, నాన్నగారితో చెప్పి?"

"నువ్వే చెప్పరాదూ, మీనాన్నగారితోనూ?"

"చూశావా అమ్మమ్మా, మళ్ళీ?"

"దగ్గిర వుండి, మీనాన్నచేత నేను రాయిస్తాను గానీ, యేదీ, చెల్లాయి వుత్తరం చదువు"

"....మమ్మ ల్నియేటి పండుక్కి తీసుకువెళ్ళడాని కిష్టం లేకపోతే— అంటే వీలులేకపోతే మానెయ్యవచ్చు, పట్టు బందీ లేదు. అయితే—"

"ఇక 'అయితే' అన్నమా టెందుకూ మరీ?

"అదే లౌక్యం. ఇంకా విను"

"అసంగతయినా నువ్వు రాయవలసే వుంటుంది మాకు. ఏమంటే? ఈ సంవత్సరం పండుక్కి, నాకోసమూ మీ అల్లుడుగారి కోసమూ కొన్నియేర్పాట్లు చేసి మరీ వెళ్ళవలసి వుంటుంది మా అత్తగారికి. అంతే గాని, మరెందకూ తొందరపెట్టడం లేదు నిన్ను."

"మరెందుకూ కాకపోతే, అంతస్నేహం గదా, ఆపిల్లతోనే వెళ్ళక పోయిందీ దాని పుట్టింటికి?"

"పోనీ, ఆమా టయినా రాయించావా నువ్వు?"

"ఏం, మరి రుక్కమ్మ కేమి చెబుతావో చెప్పవే"

"చెప్పడాని కేం వుందమ్మా? దానితో మేము రాస్తేనే చేసుకుందా తాను స్నేహం?"

"అతికింది, జవాబు"

"ఇంకోటి కూడా వుంది చూశావూ? ఇక్కడికి రావాలనుకున్న ఆపిల్ల, తాను ముందు వెడుతోంది గదా, రాజు నెందుకు తీసుకువెళ్ళలేదూ తనతో?"

"అవునేవ్! నాకు తోచిందే కాదు చూశావా, యీ పాయింటు?"

"ఇంకా వుందమ్మా, మరో పాయంటు"

"అదేమిటి మామ్మా?"

"రాజు మాట చెప్పు. తానిక్కడికి ముందు వస్తే తనతో ఆపిల్లని తీసుకువచ్చును గదా, ఆపిల్ల ముందు వెడుతున్నపుడు దానివెంబడి తానే యెందుకువెళ్ళింది కాదూ?"

"భేష్! చెన్నాపట్టం ప్లీడర్లు కూడా చెప్పలేరు దీనికి బదులు"

"అయ్యో, వెర్రి అమ్మమ్మా చెన్నాపట్టం దాకా యెందుకమ్మా యీమాత్రం భాగ్యానికీ?"

"అయితే, నువ్వు చెప్పు చూతాం"

"రాజుతో ఆపిల్ల నిక్కడికి రాకుండా చేసిందీ, ఆపిల్లతో రాజు వెళ్ళకుండా చేసిందీ అమ్మ కాదుటమ్మా?"

"అదెలాగేవ్?"

"పోనీ, రాజుకిరాయవద్దు బదులు, ఆపిల్లకయినా రాసిందా, అమ్మ?"

"సెబాస్, నోరు కుట్టేశావు నువ్వు. రాజే అనుకుంటే, యుక్తిలో కూడా దానికంటే పైదానవే నువ్వు. సరే గానీ, యేదీ తరవాయి చదువు"

"అయితే, మా పెద్దతోటికోడలూ బావగారూ నిన్న మెయిలుకే వెళ్ళారు, విశాఖపట్నం. మామరిదికి మొన్న శ్రావణంలోనే పెళ్ళయింది కనక, అతణ్ణీ మా అత్తగారినీ, మా మామగారినీ ఆడబడుచునీ పిలవడం కోసం మొన్నరాత్రే వచ్చారు, మామగారూ, చిన్న బావమరిదీనీ"

"వస్తే?"

"ఏమో?"

"పిలుపులయిపోయాయికనక యీవాళపొద్దున్న వెళ్ళిపోయారు వారు. మాఅత్తగారూ, మరిదీ, ఆడబడుచూ రేపు వెడతారు"

"వెడితే?"

"అదేమో?"

"గుడివాడే కనక, మా మామగారు వెడుతూ వస్తూ వుంటారు"

"లేకపోతే వస్తుండ మను, యెవళ్ళకేం, ఆ పెళ్ళాంగారికే లేనప్పుడు?"

"నిన్న నేనూ, మీఅల్లుడుగారూ, మా అత్తగారూ బజారుకి వెళ్ళాం. మా మరిది మామగారికీ, బావమరిదికీ బట్టలు పెట్టాలి కాదూ, అందుకోసం వెళ్ళాం బలవంతం చేసి మా అత్తగారు తీసుకువెళ్ళారు నన్ను"

"పిలవగానే యెందుకు వెళ్ళగూడదో?"

"కాకపోయినా, లక్షపనులు చేసుకుంటారు తాము. అవన్నీ మాకు రాయడం యెందుకమ్మా, తీరి కూచునీ?"

"ఏదో వుంది, యెత్తు"

"పెద్ద యెత్తే వుంది, వినవమ్మా తల్లీ"

"వర్తకుడు నాలుగైదు చాపులూ ఛొక్కాగుడ్డ తానులూ ముందు పడేశాడు"

"పడేశాడో, డబ్బు దోచుకుంటాడో?"

"వాటిలో వొక జామారు ముద్దులు మూటకడుతోంది"

"అయితే?"

"నేనే చూడకుండా వుండలేకపోయా నది. నా చేతిలో వున్నది మీ అల్లుడుగా రుశాక్కున్నారు. అది విడిచిపెట్టనే లేకపోయారాయన"

"బోధపడుతోందా?"

"హు—హు—హు—"

"అదిచూసి "నువ్వెందుకోయ్ కొనుక్కోడం? ఈపండుక్కి, మీ అత్త వారు, ఈ మాత్రం జామారు పెట్ట రనుకున్నావేమిటి?" అన్నారు, మా అత్త గారు"

"పెడతాం మాంతాం, ఆవిడ పురమాయిం పేమిటమ్మా మాకు?"

"జాణేనేవ్ నీవియ్యపురాలు, ఏమిటో అనుకున్నాను గానీ, నేను?"

"ఆవిడ పూజలూ పురస్కారాలూ చూసి చాదస్తం మనిషి అనుకున్నావు కామోసు పాపం నువ్వు. అవన్నీ వాళ్ళదగ్గిర నుంచీ వీళ్ళదగ్గిరనుంచీ అవీ యివీ వొడుపుగా లాగడానికి మార్గాలు"

"పోనీ, అలాగే కాగట్టు. వెళ్ళినచోటనల్లా పేచీలు పెడుతూ కూచోడం కంటే, వశీకరణం కోసం అయినా అమ్మవారిని పూజించడం మంచిదే గా? కాక పోయినా- పండుక్కి మీరెలాగా పెడతారు, సందేహం లేదు. అయితే, అలాంటి జామారే దొరుకుతుందన్న మాటేమిటి, మీ కీ వూళ్ళో?"

"దొరుకుతుందే అనుకో. అయితే మాత్రం? రాజు మాట చెప్పు. తన మొగుడి క్కూడా తనకి నచ్చిందే పెట్టాలన్న పట్టు బందీ యేమిటమ్మా మాకూ?"

"అదీ నిజమే"

"అదేమి టమ్మమ్మా, నువ్వు కూడా అలా అంటావ్? అల్లుళ్ళకి పెట్టే బట్టలు కూతుళ్ళ కళ్ళకింపుగా వుండద్దుటమ్మా?"

"అవునే అమ్మాయీ! కూతుళ్ళకి మంచిమంచి చీరలిచ్చి అల్లుళ్ళకి, యేమడిగి పనికి వచ్చేవో యిస్తావుటే మరీ?"

"నువ్వు కూడా వాళ్ళలోనే కూడుతున్నావు, పిన్నీ"

"న్యాయం చెప్పడం గాని, మాతో కూడ్డమూ యేమిటమ్మా యిది? నయమ్మే"

"నువ్వు మరీని. చెల్లాయి మొగుడికి మంచి జామారు పెడితే, నీమొగుడి కిన్నీ అలాంటిది పెట్టక తప్పదు గదా అని దాని మాటలు బలపరుస్తున్నావు, నువ్వు. ఇలా అయితే. యీ సంవత్సరం మే మల్లుళ్ళని తీసుకురానే తీసుకు రాం, చూసుకో"

"పోనీ. మానుకో, మాకోసం తీసుకువస్తావా?"

"వాశావ్! నువ్వు మంచి జామార్లు పెట్టక పోతే మానె, సంకురాత్రి పండుగుల్లో మొగుడూ పెళ్ళాలను విడితీస్తావుటే అమ్మాయీ?"

"మహా బాగా అడిగా వమ్మా........ఏం, వూరుకుంటావేం, యేమి చెబు తావో చెప్పు, అమ్మమ్మకి?"

"మాట్టాడదు........పైగా, నవ్వుకుంటోంది, చూడవమ్మా, అమ్మమ్మా!"

"అది వొట్టి నవ్వు కాదమ్మా! అదృష్టవంతురా లయిన గృహిణి అనుభ వించే ఆనందం అది, అది సరే కాని యేదీ, వుత్తరం చదువు"

"దేని కయినా మా అమ్మవు నువ్వు, నీయిష్టం. ఆపైని నాన్నారున్నారు, పెద్దలు, మీ రిద్దరూ యేమి చేసినా మంచే చేస్తా రెప్పుడూను; కనక, మమ్మల్నీ యేడు తీసుకువెళ్ళాలని మీకు లేకపోతే యిబ్బంది లేదు"

"అలా ఆమాట మళ్ళీ రాయడం యెందుకూ?"

"నే ననేదీ అదేనమ్మా! "తీసుకువెడితే గాని నేను వొప్ప"నని ధరణా కూచోడం అంటావా, కాదంటావా యిది?"

"సందేహ మేం, యింకా?"

"పోనీ, అంతటితో సరిపెట్టిందా? చూడు, తరవాత యేమి రాసిందో?"

"మీకు, మమ్మల్నీయేడు తీసుకువెళ్ళాలని వుండకపోతే, ఆమాటయినా, నాన్నా రక్కరలేదు, నువ్వయినా నాకు రహస్యంగా రాస్తే—"

"రాయవు నువ్వు, తనేం చేస్తుందేమిటి?"

"రహస్యం మాత్రం యేమిటమ్మా మాకు?"

"నిజమే. చెప్పి మరీ మానేస్తారు మీరు. తనేం చెయ్యగలదంట?"

"వినవమ్మా, నాతల్లీ!"

"నాడబ్బు పెట్టి నేను కొని, మీ రిమ్మన్నారని చెప్పి—"

"ఆ, ఆ!"

"మే మతగాణ్ణి తీసుకురాకపోయినా మేము జామారు వెల యిచ్చుకో వలసిందే నన్నమాట. ఇదేం చోద్యమమ్మా, పిన్నీ?"

"వాశావ్! ఇది నీయిల్లు గోకేస్తుంది గాని మానదు. సంవత్సరానికి రెండుమూడు వంద లయినా మూటకట్టి వుంచాలి దీనికోసం"

"ఆ, రమ్మన్నారు తిమ్మన్న బంతికి. తతిమ్మా వాళ్లో మరీ, దానికే అంత పెడితే? ఇలాగ, వున్నదంతా ఆడపిల్లలకు పెట్టేసి, వొక్కగానొక్క నాయన, మొగపిల్లాణ్ణి పాడుచేసుకోనా?"

"మాకు పెడితే తమ్ముణ్ణి పాడుచెయ్యడం యెందు కవుతుందీ? అదేమి టమ్మమ్మా, మా అమ్మ అలా అంటుందీ?"

"కాదే అనుకో. మాయింటి కతనువస్తే — అంటే మేము తీసుకువస్తే సుమా— మాకు తోచినకాడికి మేము పెడతాంగాని, యిదేం ముఘపా?"

"నిజమే. ఇది కొత్తపద్ధతి"

"ఇందులో వున్న కిటు కేమిటో కనిపెట్టలేకపోయావు నువ్వు"

"ఇంకేం వుందే?"

"కూతుళ్ళను పండుక్కి తీసుకువచ్చి, వున్నకాడి కేదో పచ్చంచుల బట్టలు పెట్టడం వుంది, లోకంలో. అల్లుళ్ళకిన్నీ పెట్టి తీరా లన్న నిర్బంధం లే దెక్కడా"

"అవును, అయితే?"

"అసలు. తననే తీసుకువస్తామో తీసుకురామో అన్న స్థితిలో, తన మొగుడికే ముందు కొనిపించేసుకుంటే?"

"మరేనేవ్! ఎంత యెత్తెత్తిందే, మొన్నటిపిల్ల, రాజు"

"పెద్దదాన్ని చూడూ, యెలా నవ్వుకుంటోందో? అంతా గూడుపుటాణీ"

"నవ్వుకుంటోం దంటే తప్పా? పట్టుకు వెళ్ళతగ్గవాళ్ళు కారూ వాళ్ళు, మరీ?"

"పట్టుకు వెడితే, యిలాగటమ్మా?"

కాదుటే

"అయితే, అమ్మాయీ! ఇప్పటికి తెచ్చుకుంటూనే వున్నావు నువ్వు, నీతమ్ముళ్లతో పోరి, యేటాను?"

"మహాబాగా అడిగా వమ్మా"

ం లేదూ?

"అడగ మను నాకేం భయమా? నామరదళ్ళు తెచ్చుకోడ

అలాగే నేనూ తెచ్చుకుంటున్నాను"

కుని — నీ

"రేపు పొద్దున్న నీకోడలు తెచ్చుకోదూ? నువ్వూ తెచ్చుక్!"

కోడలు తెచ్చుకుని— మధ్య నీకూతుళ్ళా చేతకానివాళ్ళు? బాగుందే రాశానా,

"చేతకానివాళ్ళా? ఆ వుత్తరం చూశావా? నే నెప్పుడయిన

మాఅమ్మ కలాగ?"

"నువ్వు రాసేదాకా వూరుకుందా మీ అమ్మ?"

"మళ్ళీ అడుగు, గట్టిగా అడుగు"

"అదేమిటి పిన్ని వాళ్ళ నలా పూసుకువస్తావూ, వాళ్ళు దగ్గిరా నేను దగ్గిరా నీకు?"

"నువ్వే దగ్గిర"

"ఇంకేం?"

"కానీ___"

"ఇక కానీ యెందుకూ?"

"అసలుకంటే వడ్డీ ప్రియం అని సామెత కనక, నువ్వు నాకూతురి వయితే, వాళ్ళు నాకూతురి కూతుళ్ళు కనక, వాళ్ళే దగ్గిర నాకు"

"ఉన్నమాట చెప్పావమ్మా, నువ్వు ధర్మదేవత వమ్మా, నీకు దణ్ణమమ్మా"

"హోస్ ధర్మదేవతట ధర్మదేవత! మా పిన్ని నాపక్షం అయితే దణ్ణం గిణ్ణం పెడుదువేం నువ్వు?"

"ఇంతెందుకూ, వొక్కటి చూడు అమ్మాయీ?"

"ఏమిటది?"

"ఇప్పుడు నేను నీకో కమలాఫలం యిస్తా ననుకో"

"ఇస్తావు"

"నువ్వది అనుభవించగలవా?"

"నావల్ల కాదు సుమా"

"మరేం చేస్తావూ?"

"నాబిడ్డలకు పెట్టుకుంటాను"

"అప్పుడు నా కెలా వుంటుంది?"

"పరమానందంగా వుంటుంది"

"కనక, నీబిడ్డలు దగ్గిరా నాకు, నువ్వు దగ్గిరా?"

"ఇంకేం చెప్పగలనమ్మా నేనూ?"

"నువ్వు చెప్పడం యెందు కమ్మా నాకూ?"

"నాకంటే నాకూతుళ్లే దగ్గిర అయితే, నీమనమరాలి వుత్తరమే విను, పోసీ"

"ఏది రుక్కూ, చదువు"

"ఉండు. ఇంతకీ, అంత త్వొందర యెందుకో తెలుసా?.... చదవ్వే అమ్మాయీ!"

"ఆలస్యం చేస్తే, ఆచాపు మరెవ రయినా పట్టుకుపోవచ్చు. అందుకూ నా ఆందోళన"

"శా—బా—సు"

"అలా అయితే అతడు కొనుక్కోవాలి. కాదంటే, ఆశ రేకెత్తించింది కనక, తల్లి కొనియివ్వా లతనికి. తన కెందుకమ్మా, ఆపురపురా?"

"ఈమాట వెంకుసోదెమ్మ అత్తగారికే రాయినువ్వు. తప్పేం?"

"అయితే, నా మాట పుచ్చుకునే కొనుక్కుంటున్నారా, చెల్లాయి అత్తవారూ, నీ అత్తవారూ కావలసిన వన్నీని? ఏమే పిన్నీ?"

"అవును గానీ—యిది అలాంటిది కాదు గానీ—"

"ఇది రావలసిందే గాని కావలసింది కాదుగా? కదుటమ్మా అమ్మమ్మా?"

"అవునేవ్! మరి నీకూతురికి బదులు చెప్పు, చూతాం"

"అవును గానీ—ఇది అలాంటిది కాదు గానీ—"

"అదేమిటి?"

"మళ్ళీ అదేమి టేమిటి? నీకూతురికి నువ్వు చెప్పినట్టు లేదేం నాకూతురికి నేను చెప్పింది?"

"మీ అమ్మ వాలకం చూశావుటే రుక్కూ?"

"నీవాలకం మా అమ్మకి వచ్చింది, మా అమ్మవాలకం మాకు వచ్చింది, చూడ్డాని కేం వుం దమ్మమ్మా?"

"నీపెద్దకూతురి ధోరణి చూశావుటే అమ్మాయీ?"

"నాచిన్న కూతురి ధోరణి చూడ్డం అయిందికనకనా, అప్పుడే నాపెద్ద కూతురు దాకా వెడుతున్నావు, మరి?"

"అవునవును, ఏదీ, చదువు రుక్కూ"

"వెల యెంతో విన్నావా?"

"అది కూడా రాసిందీ?"

"ఏమి చెప్పుకోనే మాతల్లీ? చదువు రుక్కూ"

"...... మీఅల్లుడుగారి వుబలాటమూ, నా ఆదుర్దాచూసి "వెల యెంత?" అనడిగారు, మా అత్తగారు. వియ్యంకుడుగారికి కొన్న జామారు లాగ యే పది రూపాయలకో వస్తుం దనుకున్నారు, పాపం ఆవిడ." యాభయ్యో అరవయ్యో వుంటుం దేమో బాబూ" అని నేను పితపిత లాడిపోయాను. ఇంతా చేస్తే, ముప్ఫయి రూపాయలు చెప్పాడు వర్తకుడు. పాతిక రూపాయల కిస్తే మనకి లాభం. మరో రెండో మూడో యిచ్చినా నష్టం లేదు. సరికొత్త రకం కనక, మీ అల్లుడుగారు మనసుపడుతున్నారు కూడా కనక, ముప్ఫయి రూపాయిలూ యిచ్చినా యెక్కువనిపించదు"

"ఆహా, ఆహా, యెంత చక్కగా తేల్చిందే లాభనష్టాలు? మీ చాతుర్యమే నాతల్లీ?"

డబ్బిచ్చేవాళ్ళు మరొకళ్ళయితే, మరో పది యిస్తే ధర్మంగా కూడా వుంటుంది, కదుటే పిన్నీ?"

"మహా బాగా చెప్పావు. ఏదో సామెత చెప్పిన తరవాయిగా—"

"ఇంకా వినవమ్మా, అప్పుడే అయిందా?"

"నిజం చెప్పవద్దూ? నామట్టుకు నాకు, లెక్కలు చూసుకుంటే వెల యెక్కువే అనిపిస్తోంది. అయితే, ఆ చక్కదనమూ, ఆకొత్తదనమూ చూస్తే తక్కువే అనిపిస్తోంది, మళ్ళీ"

"ఇందాకటికంటే బాగుం దీ ధోరణి. సెబాస్!"

"ఆ రాత దగ్గిర కవిత్వం యెందు కయినా పనికివస్తుందా, దీర్ఘాలు తియ్యడానికీ, రాగాలు పెట్టడానికీ గానీ?"

"రాగాలు తియ్యడమే కనపడుతుందిగాని, వొక్క అక్షరమయినా తెలుస్తుందా, బాగుండడానికీ బాగుండకపోవడానికిని"

"అవునవును"

"............తప్పటడుగులు వేసుకుంటూ తమ్ముడు మసులుతూ వుంటే మన యిల్లెంత శోభాయమానంగా వుంటుందో ఆ జామారుతో ఆషాపు అంత దేదీప్యమానంగా వుంది"

"ఆ, ఆ"

"ఇంకా వినవమ్మా మాతల్లీ"

"మీఅల్లుడుగారు వుభయపింజలూ పోసి కట్టుకుంటారు కనక, అప్పుడది మరీ సొగసుగా వుంటుంది"

"వోహో, వోహోహో!"

"అతగా డది కట్టుకుని యెదుట నుంచున్నట్టు తోపిస్తోంది, చూశావా దాని శక్తి?"

"కనక, కొనమ్మా, కొను. పిల్లల వుబలాటం తీర్చకపోతే పండుగ చేసుకున్నట్టే వుండదు, శ్రమే గానీ"

"సరే, నువ్వింకా మారుదారినే వున్నావు"

"అంటే?"

"నేను కొనడం యేమిటమ్మా, యింకా కూచుం దనుకున్నావా యేమిటది, ఆషాపులో?"

"నువ్వనే దేమిటో నా కర్థం కావడం లేదు, తరవాత యేమి రాసిందో చదువు రుక్కూ"

"ఆ జామా రింటికి తెచ్చుకోడమూ, దానితో పాటు తామూ షాపులో వుండిపోడమూ అన్న అవస్థలో పడ్డారు, మీ అల్లుడుగారు. "వెళ్ళిపోదాం రండర్రా" అంటూ వాకటే తొందర ప్రారంభించారు మా అత్తగారు ఒక్క క్షణం నాకు మతిపోయింది, చూశాను చూశాను, నువ్వు నన్ననుగ్రహించకపో వన్న ధైర్యంతో జామారు చేతపుచ్చుకుని "డబ్బిచ్చేస్తాను. మీ మనిషిని పంపండి మా యింటికి" అని వర్తకుడికి చెప్పి, కారెక్కేశా న్నేను, చివరికి"

"చూశావా, చూశావా?"

"చూశావా అంటే అంతకంటే మరేం చెయ్యగలదమ్మా, చెల్లాయి అప్ప డమ్మమ్మా?"

"చూసేం చేస్తుం దమ్మమ్మ, నాకు తెలుసు, నువ్వే నేర్పావు దానికి"

"అదేమిటో ఆగొడవ కూడా కాస్త నా చెవిని పడెయ్యవే అమ్మాయీ"

"తన మొగుడికోసం తనకి నచ్చిన జామారు కొనుక్కువచ్చింది నిరు డిది. దీన్ని చూసి యీ సంవత్సరం అదీ చేసిందావని. తోడిదొంగలు వీళ్ళు"

"అవునా?"

"నిజమే నమ్మా! అస లేమి జరిగిందో విన్నావా?"

"నువ్వు చెప్పావా?"

"మాకు నచ్చిన చీర లేరుకోమని నన్నూ చెల్లాయినీ బజారుకి తీసుకు వెళ్ళారు నిరుడు నాన్నారు. మేము చీర లేరుకొన్నాక, అల్లుడుగారికి జామారు కూడా నన్నే యెంచుకోమన్నారమ్మా"

"ఇంకేం? నువ్వెంచుకున్నావు, తప్పు మీ అమ్మది కాని నీది కాదమ్మా!"

"నాతప్పేమి టమ్మోయ్, మధ్యని?"

"మరి నువ్వెందుకు వెళ్ళావు కాదూ, బజారుకి?"

"తండ్రి వెళ్ళారు కనక సేలంపట్టు చీరలతో సరిపెట్టారు వీళ్ళు, నేనే వెడితే, బెంగుళూరి చీరలు చంకన పెట్టుకుందురు"

"ధర్మమే. తల్లికీ తండ్రికీ వున్న భేదం అదే కాదూ మరీ? అయితే లే, యీసంవత్సరం కొనమ్మా. బెంగుళూరి చీరలు, మాట తేనే తెచ్చావు కనక"

"నూటొక్క దణ్ణాలు నీకు. మా అమ్మకి మళ్ళీమళ్ళీ చెప్పు, ఆమాట నువ్వు"

"నేను చెప్పనక్కరలేదే వెర్రిపిల్లా మీఅమ్మకి తెలిసిన ట్టెవరికి తెలుసూ, అందచందాలు మన వాళ్ళల్లో?"

"అందాల కెక్కడికి పిస్నీ? మీ అల్లుడుగారు సంచులకు సంచులు సంపాదించి పోస్తున్నారు కనక, తాళాలు కూడా నాచేతి కిచ్చేశారు కనక, అందాలు చూపించగలుగుతున్నా న్నేను. రాజుమాట చెప్పవమ్మా!"

"చెప్పడాని కేం వుందే? మొగుడి క్కూడా జామా రెంచుకోమని రుక్కుకి చెప్పిన నీమొగుడు రాజుని మాత్రం యెంచుకోమనడూ? ఇలా అనుకుని అది సాహసించింది. నిక్షేపంలా వుందది చేసిన పని"

"మొదణ్ణుంచీ వాళ్ళపక్షమే మాట్టాడుతున్నావు, నువ్వు"

"వొనే, అమ్మాయీ! నన్నంటావు గానీ, వాళ్ళ పక్షం కాకుండా వుండగలవా, నువ్వు మాత్రం?"

"అమ్మబాబోయ్! ఊరికే అన్నాను గానీ, నేనుండగలనా? నాకూతుళ్ళవంటి కూతు ళ్ళున్నారా, పృథివిమీద మరెవరికయినా?"

"అదిమాత్రం నే నొప్పుకోనుసుమా"

"అదేమిటమ్మా?"

"మరి, నా కూతురువంటి కూతుళ్ళు మాత్రం—"

"వోస్, అదా? మా అమ్మకంటే ఎక్కువ యిదిగా చూస్తావు నన్ను నువ్వు. మాఅమ్మ యెక్కడో నెల్లూరిలో వుండినా, నువ్విక్కడ వున్నావు కనకనే నేను బతగ్గలుగుతున్నాను"

"నాతల్లి నాతల్లి, నీకేమీ లోటు లేదమ్మా, జమిందారు రాళ్ళు కూడా నిన్ను పోల రమ్మా. నీకూతుళ్ళుగూడా అచ్చంగా నీలాగే వుంటున్నారు తల్లీ"

"రాజు అలా వుత్తరం రాసిం దంటే యెందుకు రాసిందీ? తన వుబలాటమూ, చనువూ చూపించుకుంది గానీ—"

"కనక, తొరగా వుత్తరం రాయించెయ్యి, అల్లుళ్ళకి"

"ఉత్తరా లెందుకమ్మా, మీ అల్లుడుగారు తొమ్మిదిగంటల బండికి వెడితేనూ?"

"కాకినాడ వెళ్ళా రన్నావు, నాన్నారు?"

"కాకినాడ కాదమ్మా, బెజవాడ"

"మాళావా, నాదగ్గిర దాస్తావా?"

ఈపాటికి బెజవాడ చేరుకుంటారు మీ నాయన, నీమొగుణ్ణి వెంటబెట్టుకుని రాత్రిబండిలో యేలూరు వస్తారు. చెల్లాయినీ నీ మరిదినీ కూడా వెంటబెట్టుకుని రేపు మెయిల్లో యిక్కడికి వస్తారు, నే నేం దాచానే? దాచడాని కేం వుందమ్మా యిందులో?"

"కాకినాడ అని—"

"నే నన్నానా యేమిటి? బెజవాడ అనపోతే కాకినాడ అని వచ్చింది కామోసు. మాట, నాకు జ్ఞాపకం లేదు సుమా"

"మీ అమ్మ కాకినాడ అంటేం బెజవాడ అంటేం. రేపు మెయిల్లో నీ మొగు డిక్కడికి వస్తున్నాడు, సరా?"

"................"

"మీ అమ్మా బెంగుళూరి చీరలు కూడా కొనిపెడుతుంది, సరా?"

"అవునుటే అమ్మా, చెప్పవ్? చూశావా అమ్మమ్మా?"

"నీకూ చెల్లాయికీ సమంగా యిమ్మని మూడు వందలిచ్చారు మీనాయన చేతికి. మీయిష్టం వచ్చినవి కొనుక్కోండి తల్లీ"

"ఇష్టానిష్టాలు మేము చెబుతాం, కొనడం మాత్రం నువ్వే. అమ్మమ్మని కూడా తీసుకువెడదాం బజారుకి"

"వస్తానమ్మా, నేనూ వస్తాను, ఇంతకంటేనా? ఇంటో కూచోలేక యిట్టే వచ్చినందుకు మంచిమాటలే చెవినిపడ్డాయి. మరి పోతా............?"

"కాస్సేపు కూచోవే మాతల్లీ"

"కూచోను, కూచోను. మావాణ్ణి పండక్కి పిలుచుకువెళ్ళడానికి బావ మరిది వచ్చాడు. మిఠాయి పొద్దున్నే చేయించి వుంచాను గాని, యింకా—కాఫీ—అదిగో మూడు కొడుతోంది—బాబోయ్! నాకొడు కేం కంగారు పడిపోతున్నాడో............"

"ఇదిగో, మళ్ళీ వస్తావు కాదూ, సావకాశంగానూ?"

"................"

"ఏమిటీ పిన్ని అంటోంది, నీ కయినా వినపడిందా తల్లీ?"

"ఏమిటో భోజనం చేశాక అంటోంది, రాత్రో రేపు మధ్యాహ్నమో మరి"

"చిన్నమ్మమ్మ నాకు గౌనూ పరికిణీ కుట్టించకుండా వెళ్ళిపోయింది, చూశావుటే అమ్మా?"

"బుల్లిమామయ్యతో చెప్పు వెళ్ళి........తొరగా వెళ్ళు"

1934 ఫిబ్రవరి
ప్రబుద్ధాంధ్ర నుంచి పెంపకం.